అదుపు తప్పితే అంతే..




తాంసి/ఇచ్చోడ: భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామ సమీపంలోని వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా ఉండే రక్షణ గోడలు కూలిపోయాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అలాగే ఇచ్చోడ మండలంలోని దాబా(బి) వద్ద రోడ్డు కోతకు గురైంది. రాత్రి వేళ ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపైనే పశువులు..



నేరడిగొండ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై పశువులు రోడ్డుపైనే సంచరిస్తుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పలు సందర్భాల్లో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి పశువులను ఇతర ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

- నేరడిగొండ

ముందుకు సాగని రోడ్డు పనులు

- గుంతలమయంగా లాండసాంగ్వి రోడ్డు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



కంకర తేలిన లాండసాంగ్వి రోడ్డు

ఆదిలాబాద్‌రూరల్: జైనథ్ మండలంలోని తరోడా గ్రామ సమీపంలోని సాత్నాల వాగుపై వంతెన కుంగిపోవడంతో అటు వైపు నుంచి వెళ్లే భారీ వాహనాలు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి మీదుగా వెళ్తున్నాయి. జిల్లా కేంద్రానికి అనుకొని ఉన్న లాండసాంగ్వి గ్రామానికి వెళ్లే రోడ్డు గుండా వాహనాలు వెళ్లడంతో గుంతలమాయంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు. ఐదు నిమిషాల ప్రయాణం ఆర గంట పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందుకు రోడ్డు పనులు..

తరోడా సమీపంలోని వంతెన కుంగిపోవడంతో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామం మీదుగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. 15 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం గతంలో రూ. 44.20 కోట్లు మంజూరు చేసింది. సింగిల్ రోడ్డు, గుంతలమయంగా ఉండడంతో ప్రమాదాలు సంభవించడంతో పాటు వాహనాలు మొరాయిస్తున్నాయని ప్రజలు రోడ్డుపై బైఠాయించి ఆందోళనలు చేశారు. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ హడవుడిగా పనులు ప్రారంభించి, తరువాత చేతులెత్తేశాడు.

మొరాయిస్తున్న వాహనాలు

రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో గుంతల నుంచి, కాంక్రీట్ రాళ్లపై వాహనాలు నడపడంతో వాహనాలు మొరాయిస్తున్నాయని వాహనదారులు అంటున్నారు. అంతే కాకుండా దుమ్ముతో అనారోగ్యాల బారిన పడుతున్నాయని వాపోతున్నారు. పనులను వెంటనే ప్రారంభించి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే గిరిజనుల అభివృద్ధి



ఆరు గ్యారంటీలపై ప్రచారం చేస్తున్న సంజీవ్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: గిరిజనుల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని గొండుగూడ, ఖానాపూర్, అల్లికొరి, పొట్టంలొద్దీ గ్రామాల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతినెల రూ. 2,500, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తామన్నారు. ప్రతీ కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చినా హామీలకు కట్టుబడి ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దుబే సంజీవ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు అంబకంటి అశోక్, రాహుల్, గోపాల్ పాల్గొన్నారు.

‘కబ్జా భూములను పేదలకు పంచుతాం’



మహిళకు కండువా కప్పుతున్న శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచుతామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో కాలనీవాసులు పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న అనుచరులే భూములన్నింటినీ ఆక్రమించుకున్నారని ఆరోపించారు. మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నే ఎమ్మెల్యేను ఓడించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ముడుపు దామోదర్ రెడ్డి, భరత్ వాగ్మారే, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలికల దినోత్సవం



మాట్లాడుతున్న డీసీపీవో రాజేంద్ర ప్రసాద్

తలమడుగు: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం మండలంలోని లింగి గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికాత, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీవో రాజేంద్ర ప్రసాద్, మహిళ సాధికారిత కోఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ.. ఆడపిల్లలపై ఉండే వివక్షత, హింస, బాల్యవివాహాల వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్, రమేశ్, సఖీ నిర్వాహకులు సరస్వతి, ఎస్‌వో సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఆధార్ కేంద్రం

- ఉచిత సేవలకు డబ్బులు వసూలు
- అధికారులు హెచ్చరించినా పట్టించుకోని నిర్వాహకుడు



మీసేవ కేంద్రంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రం

గుడిహత్నూర్: మండల కేంద్రంలో ఆధార్ నిర్వాహకులు ఉచితంగా అందించాల్సిన సేవలకు డబ్బులు వసూలు చేస్తున్నారు. డొంగర్‌గావ్‌కు చెందిన ఉప సర్పంచ్ సమీనా తాహేర్‌ఖాన్ తన కుమారుడి ఆధార్ నమోదు కోసం వెళ్లగా.. రూ.100 చెల్లించాలని సూచించడంతో చెల్లించారు. వాస్తవంగా ఆధార్ నమోదు సేవలు ఉచితంగా ఉంటాయి. కానీ ఇక్కడ లబ్ధిదారుడికి తెలిసి ఇదేంటని అడిగితే.. స్టేషనరీ చార్జీలు అంటూ వసూలు చేస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయం పక్కనే పాత తహసీల్దార్ ఆఫీసులో నిర్వహించాల్సిన ఆధార్ సెంటర్ మూసి ఉండడంతో తెలిసిన వారు ఆదిలాబాద్‌లోని మీసేవకు వెళ్లాలని సూచించారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా మీసేవ కేంద్రంలోనే ఆధార్ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ విషయమై జిల్లా అధికారి ఈడీఎం బండి రవికుమార్‌ను వివరణ కోరగా.. ఆధార్ కేంద్రాన్ని మీ సేవలో కొనసాగించడం నేరమన్నారు. గతంలోనే వీరిని హెచ్చరించడం జరిగిందని పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

చెత్తాచెదారం తొలగింపు



చెత్తను తొలగిస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

ఇచ్చోడ: మండల కేంద్రంలోని పలు కూడళ్ల వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని పంచాయతీ సిబ్బంది తొలగించారు. బుధవారం సాక్షిలో కంపు.. కంపు అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో చెత్తను తాత్కాలిక సిబ్బందితో తొలగించి శుభ్రం చేశారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత బీజేపీ మొదటి సభను ఆదిలాబాద్ గడ్డపై ఏర్పాటు చేసి, తెలంగాణలో సమర శంఖాన్ని పూరించిందన్నారు. జనగర్జన సభకు వచ్చిన జనం ఉత్సాహాన్ని చూస్తుంటే ఆదిలాబాద్‌లో బీజేపీ జెండా ఎగరడం ఖామన్నారు. సభ విజయవంతం కోసం అహర్నిషలు పాటు పడిన కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జోగు రవి, లోక ప్రవీణ్‌రెడ్డి, బోయర్ విజయ్, రాందాస్, ఆకుల ప్రవీణ్, వేదవ్యాస్, ముకుంద్‌రావు, కృష్ణ, రఘుపతి, గొర్ల రాము, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఏటీడీవో నిహారిక

ఆదిలాబాద్‌రూరల్: వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదిలాబాద్ ఏటీడీవో నిహారిక అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని వాన్‌వాట్, మామడిగూడ, చించుఘాట్ ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న గదులను పరిశీలించారు. వసతి గృహాల పరిసరాలను, వంట గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏటీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సంజీవ్, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

తలమడుగు: నిర్మల్ జిల్లా బాసర మండలం కిర్గుల్ గ్రామంలో దళిత మహిళలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మండల మాల సంక్షేమ సంఘం నాయకులు గంగన్న డిమాండ్ చేశారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దళితులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, రాకేశ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలు చేసిందేమీ లేదు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఎదులాపురం: 70 ఏళ్ల పాలనలో కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణకు చేసింది ఏమీలేదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న విమర్శించారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని వరలక్ష్మినగర్‌కు చెందిన సోషల్ వర్కర్ మతిన్‌తో పాటు మహిళలు, యువకులు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు తమ ప్రభుత్వంలో ఉన్నత విద్యతో పాటు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా కొలువులు సాధించారని అన్నారు. తెలంగాణలో ప్రజలు అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని కోరుకుంటున్నారని, అది బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, సాజిదొద్దీన్, సలీం పాషా, సదర్ రసూల్, ఆనంద్, బాదం గంగన్న పాల్గొన్నారు.

హన్మంత్‌రావ్ సేవలు చిరస్మరణీయం

ఆదిలాబాద్‌రూరల్: బెజ్జంకి హన్మంత్‌రావ్ (అడ్వకేట్) సేవలు చిరస్మరణీయమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం మావల మండల కేంద్రంలోని పద్మనాయక గార్డెన్‌లో నిర్వహించిన హన్మంత్‌రావ్ సంతాప సభకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదిలాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ రంగినేని మనీష పవన్‌రావ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావ్, హైకోర్టు అడ్వకేట్ వెంకట రమణ, బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అల్లూరి సంజీవ్ రెడ్డి, అంబకంటి అశోక్ పాల్గొన్నారు.

‘లంబాడాలపై బీఆర్‌ఎస్ చిన్నచూపు’

ఖానాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం లంబాడాల పట్ల చిన్నచూపు చూస్తోందని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 40 నియోజకవర్గాల్లో ఎల్‌హెచ్‌పీఎస్ అభ్యర్థులను పోటీ చేయించి బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపడమే తమ ఎజెండా అని పేర్కొన్నారు. ఆయా నియోజకవర్గాల్లోని ఉద్యమకారులతోపాటు గ్రూప్–1 అభ్యర్థులను పోటీలో ఉంచుతామని హెచ్చరించారు. కేసీఆర్ నియంత పాలనలో ప్రశ్నించే గొంతుకలను అణచివేసి పోలీస్ రాజ్యంలో ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. బహుజన రాజ్య అధికారమే లక్ష్యంగా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం



మాట్లాడుతున్న ఆర్టీసీ విలేజ్ అధికారి సాయన్న

లోకేశ్వరం: సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు సాగించాలని భైంసా డిపో విలేజ్ అధికారి సాయన్న అన్నారు. బుధవారం మండలంలోని పుస్పూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ అందిస్తున్న వివిధ రకాల సేవలు, బస్‌పాస్‌లను వివరించారు. శుభకార్యాలు, పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు అద్దెబస్సులు దొరుకుతాయని పేర్కొన్నారు. ఆర్టీసీ వారు దసరా ధమాకా పేరిట లక్కీ డ్రా నిర్వహిస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగెం నర్సయ్య, ఆరోగ్య కార్యకర్తలు అనిత, సునీత, వీడీసీ సభ్యులు ఉన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి



మాట్లాడుతున్న దాసరి శంకర్

ఖానాపూర్: రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ అర్ధాంతరంగా నిలిచిపోవడంతో.. కనీసం బదిలీ అయిన వారినైనా ప్రభుత్వం రిలీవ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో మాట్లాడారు. ఉపాధ్యాయులు అవసరమైన చోట ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం లోపభూయిష్ట విధానాలతోనే బదిలీలు, పదోన్నతులు నిలిచి విద్యారంగంలో సంక్షోభం ఏర్పడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, రాజు, సుచిత్ర, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

దీక్ష భగ్నం చేసినా ఉద్యమం ఆగదు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని 87 రోజులుగా ఉద్యమం చేశామని, ఈనెల 10న బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు చేపట్టిన ఆమరణ దీక్షలను భగ్నం చేయడం అన్యాయమని బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ.. దీక్షను భగ్నం చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో 200 మందితో నామినేషన్ వేస్తామన్నారు.

లఘు చిత్రం విడుదల

ఎదులాపురం: సైబర్ క్రైంకి సంబంధించిన ‘రాజు గారి రాజ్యం’ అనే లఘు చిత్రాన్ని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి విడుదల చేశారు. లఘు చిత్ర డైరెక్టర్, నటీనటులు బుధవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా విడుదల చేయించారు. ఇలాంటి సందేశాత్మక లఘు చిత్రాలు మరెన్నో నిర్మించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కిరణ్, నటీనటులు హరికృష్ణ కుర్మే, ఎనగంటి సతీష్, అనుదీప్ చిట్టిమల్ల, మోతే జ్ఞానేశ్వర్, పెండల సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అశ్విన్ కుమార్

ఎదులాపురం: బీఆర్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిల్పెల్లి అశ్విన్ కుమార్, పట్టణ మైనార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పర్వీన్ సుల్తానాను నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే జోగు రామన్న ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివరాం

తాంసి: సైబర్ నేరాలపై ప్రతిఒకరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శివరాం సూచించారు. బుధవారం మండల కేంద్రంలో బ్యాంక్ సమీపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే బ్యాంక్ ఖాతా, ఆధార్‌నంబర్ వంటివి ఇవ్వవద్దన్నారు. ఫోన్‌లో వచ్చిన ఓటీపీలను సైతం ఇతరులకు చెప్పవద్దన్నారు. వారి వెంట సిబ్బంది సంతోష్, రాజు, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కైలాస్‌నగర్: అనారోగ్యంతో మృతిచెందిన ఆదిలాబాద్ మున్సిపల్ పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి తోటి కార్మికులు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన గోంటి ముక్కుల చిన్నయ్య ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనది పేద కుటుంబం కావడంతో మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దర్శనాల నగేశ్ ఆధ్వర్యంలో రూ. 14,160 నగదు పోగు చేసి, బుధవారం మృతుడి భార్యకు అందజేశారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



అవగాహన కల్పిస్తున్న ఏఈవో శ్యాంసుందర్ రెడ్డి

బోథ్: మండలంలోని మహదుగూడ గ్రామంలోని రైతులకు ఏఈవో శ్యాంసుందర్ రెడ్డి సస్యరక్షణ చర్యలపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. గులాబీపురుగు సోకితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే రైతులు పీఎం ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలు, సలహాల కోసం వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

బేల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు రూ.6 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి పనులు చేపడుతున్నామని ఆదిలాబాద్ జిల్లా ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగం డీఈ అంజనేయులు తెలిపారు. బుధవారం కందకం పనులను ఆయన పరిశీలించారు. త్వరలోనే ప్రహరీ పనులు పూర్తి చేస్తామన్నారు. ఆర్టీసీ స్థలాన్ని కబ్జా చేసిన ఇళ్ల యజమానులకు నోటీసులు ఇస్తామన్నారు. ఆయన వెంట ఏఈ అజయ్, ఆదిలాబాద్ బస్‌స్టేషన్ మేనేజర్ జనార్దన్, తదితరులు ఉన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు

బోథ్: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఉన్న కల్వర్టుపై గుంత పడి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దీన్ని గమనించిన గ్రామానికి చెందిన షేక్ నాజర్ అహ్మద్ తన సొంత ఖర్చులతో కల్వర్టుకు బుధవారం మరమ్మతులు చేయించారు.